కొడిగట్టిన దీపం

శ్రీమతి వి. అనసూయ

వర్ధనమ్మగారి జీతగాడు సాయంత్రం నాలుగున్నరకల్లా హైస్కూలుఆవరణలో పంతుళ్ళందరూ విశ్రాంతి తీసుకునే గదిముందు నిలిచి ఆచారికోసం ఆతురతతో అటూ ఇటూ చూడసాగాడు చివరి పిరియడ్ పాఠం చెప్పి చేతికైన సీమసున్నం కూడా దులుపుకోకుండా, ముఖంమీది చెమటబిందువులు కూడా తుడుచుకోకుండా ఆచారి జీతగాడివెంట బయల్దేరాడు.

బజారు మలుపు తిరగగానే కనిపించే రెండంతస్థుల మేడ గేటు తెరచి లోపలికి తీసుకుపోయాడు జీతగాడు ఆచారిని. ముందుగదిలో రేడియో ప్రక్కన మెత్తలుగల పెద్దకుర్చీ పైపంచతో దులిపి "కూర్చోండి బాబూ" అంటూ జీతగాడు లోపలివాకిలి తెరగుడ్డ తొలగించుకుంటూ గబగబా లోపలికి వెళ్లాడు.

ఆచారి కుర్చీలో కూర్చోని గదంతా ఒక్కసారి కలయజూచాడు. ఎంతో అందంగా, నాగరికంగా అమర్చబడిఉన్నది. విలువగల పల్లకట్టుకుర్చీలు, తన కుడిచేతిప్రక్కగా టేబిల్ మీద బుష్ రేడియో, బ్యాటరీ సెల్స్, వాకిళ్ళకూ, కిటికీలకూ నీలపురంగు తెరగుడ్డలూ—అన్నీ చూచేసరికి ఒక పెద్దసమస్య తీరినట్లయి ఆచారిముఖంమీద ఆనందరేఖలు విరిశాయి.

"వచ్చి వారంరోజులన్నా కాలేదు. అప్పుడే ఈపాటి ట్యూషన్ తగిలింది. ట్యూషన్లు లేకపోతే ఎలాగ? వారానికొకఊరు మారుస్తూ ఈ డిస్ట్రిక్టుబోర్డువారిచ్చే డెబ్భైరూపాయలూ కాఫీనీళ్లకుచాలవు" మనసులో కదిలిన ఆనందం ముఖంమీది రేఖల్లో వ్యక్తం గాకుండా చూచాడు ఆచారి.

పదిహేనునిమిషాలు గడిచాయి.

"పోయి మేష్టరుగారికి నమస్కారం చేయి తల్లీ"—అను మందరంలో వీణతీవలు నొక్కినట్లుగా తెర వెనుకనుంచి స్త్రీకంఠం వినిపించింది.

తటాలున ఆచారి చొక్కా బుజంమీది చిరుగు కనిపించకుండా ఉత్తరీయపు చెరగులు సర్దుకుని కూర్చున్నాడు.

పరికిణీ కుచ్చెళ్లు సర్దుకుంటూ తొమ్మిదేండ్లపిల్ల ఆచారి పాదాలమీదకు వంగి నమస్కారం చేసి నిలువబడ్డది. గురువాత్సల్యంతో ఆచారిహృదయం ఆర్ద్రమైపోయింది. ఎడమచేతి ప్రక్కనున్న కుర్చీ ముందుకు లాగి "కూర్చోమ్మా" అంటూ టేబిలుమీదున్న తెల్ల కాగితాల నోటుపుస్తకాలొకటొకటే తిరగవేయటం మొదలెట్టాడు.

రెండునిమిషాలు గడిచాక "నాన్నగారున్నారమ్మా" అని మెల్లగా అడిగాడు ఆచారి.

లోపలినుంచి జీతగాడు హడావుడిగా అక్కడకు వచ్చి, "అమ్మగారున్నారు బాబూ, అయితే మా సుశీలమ్మ ఈఏడాదంతా తమదగ్గర చదివితే ఏక్లాసులో చేరుతుందంటారు?...కాస్త పరీక్ష చేయండి బాబూ!" అంటూ తలగుడ్డవిప్పి బుజాన వేసుకొని గచ్చు నేలమీద చతికిలబడ్డాడు.

ఇంగ్లీషులో, తెలుగులో వాక్యనిర్మాణం, లెక్కల్లో క. సా. గు, గ. సా. ప్ర, భిన్నాంకాలు సైన్సు, సోషల్ స్టడీస్,—జనరల్ నాలెడ్జి—అవీయివీ ఒక అరగంట స్థాలీపులాకంగా పరీక్షచేసి జీతగాడిమీదగా లోపలి తెరవైపుచూస్తూ అన్నాడాచారి, "థర్డుఫారంలో తేలికగా చేరుతుంది."

జీతగాడు ఒక్కసారి లోపలకుపోయివచ్చి సుశీల చేతిలో తాంబూలం పెట్టి "మేష్టరుగారికట, ఇవ్వు తల్లీ" అన్నాడు. సవినయంగా, ముద్దుగా లేచినిల్చిన చిరంజీవి చేతిలోని తాంబూలం అందుకుని "విద్యాప్రాప్తిరస్తు"ని తన వయస్సుకు మించిన పెద్దమనిషితనంతో ఆశీర్వదించాడు.

"రోజూ ఈ వేళకే వస్తూంటానమ్మా. మరి... వేవస్తా" ఆచారి లేవబోయాడు.

"సుశీ, మేష్టరుగార్ని ఫలహారంచేసి పొమ్మనమ్మా!" లోపలనుంచి సన్ననిగొంతు గౌరవపురస్సరంగా వినిపించి. ఒత్తుగా తొడుక్కున్న బంగారు

గాజుల్తో, విలువైన వజ్రపుటుంగరంతో తళతళ మెరిసే ఎఱ్ఱని కుడిచేయి తెరను ఇవతలగా కదిలించింది.

ఫలహారం ముగించి, తెరవైపుకు తిరిగి ఆచారి "సెలవండీ" అన్నాడు.

"మగదిక్కు లేని సంసారం, అమ్మాయి పట్టి పిచ్చిది. తమ బిడ్డగా చూచుకొని చదువు చెప్పాలి పంతులుగారు," సున్నితమైన గొంతు జాలిగా వినిపించింది.

"అట్లాగేనండీ" ఆచారి తృప్తిగా పలికి బైటకు వచ్చాడు.

మసక మసకగా చీకటి అలముకుంటూంది. పంచాయతీ బోర్డువారి ప్రజాసేవకు ప్రబలచిహ్నంగా నిల్చిన కుడ్డిలాంతరు స్తంభం ఒకటి ఆచారి ప్రక్కగా గబగబా వెనక్కు జరిగిపోయింది. ఉండబట్టలేక ఆచారి రెండడుగులు వెనక్కువేసి చేతిలోని తాంబూలం విప్పి చూచుకున్నాడు. అతని కళ్ళల్లోకి విద్యుత్కాంతులు ప్రసరించినట్లైంది. ఒక్కడుగులో ఇంటికి వచ్చిపడ్డాడు.

మైసూర్ క్రేప్ సిల్కు చీర, అద్దాలు పొదిగిన జరీ అంచుల రైక గుడ్డ - చలిమిడి, లడ్లు—మొదలైన సర్వవస్తు సంభారంతో—ఆ మరునాడు ఆచారి తల్లి, తొలిచూలు కానుపుకోసం పుట్టింటి దగ్గరున్న కోడలికి సూడిదెలు జరిపించడానికి వియ్యపురాలింటికి కదిలిపోయింది.

హోటల్లో భోజనం చేసి ఆచారి మామూలుగా స్కూలుకు వెళ్ళాడు. మొదటి పిరియడ్ పాఠం చెప్పటానికి టీచర్స్ వెయిటింగ్ రూమ్ ప్రక్కగా వెళ్తున్నాడు. హఠాత్తుగా నవ్వుల్తో కలిపి మాటలు వినిపించాయి. "వర్ధనమ్మ ట్యూషన్ మంచి వాటంగా ఉన్నట్లుందాచారికి." ఆచారికి గుండె కలుక్కుమన్నది. ఆగి, మాట్లాడే వసతిలేక క్లాసురూములోకెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం విశ్రాంతిసమయంలో సైన్సు అసిస్టెంటు అచ్యుతరామయ్యను ఏకాంతంగా ప్రక్కకు పిలిచి అడిగాడాచారి. "ఉదయం నాట్యూషన్ సంగతి ప్రస్తావించుకున్నారేమిటండీ?"

"అదే,...పాపం, ఆ యింట్లో మగదిక్కన్నా లేదా! ఆ పిల్లకు—ఇంత సొంత కూతురుకు చెప్పుకున్నట్లు చెప్పుకుంటే సరి,......ఇందులో కొంత 'సోషల్ సర్వీస్' కూడా ఇమిడి ఉంది లెండి"— అంటూ క్రిందిపెదవి ఎడమప్రక్కకు మెలిపెట్టి నవ్వుతూ మెల్లగా కాఫీహోటలు వైపు వెళ్ళాడు అచ్యుతరామయ్య.

ఆరోజు సాయంత్రమంతా క్లాసుల్లో పాఠం చెప్పడం కష్టమైంది ఆచారికి. బడి ఎప్పుడు విడిచిపెడతారా అనిపించింది.

వర్ధనమ్మగారింటి వైపు ఆచారి చకచకా కాలాడించి నడిచాడు. బయటి వాకిట్లో అడుగుపెట్టగానే లోపలినుంచి ముప్పై ఐదేండ్ల మనిషి,...మంచి భారీ విగ్రహం—ఎఱ్ఱని శరీర వర్ణం—నిండుసూటులో ఎడమచేతితో నెక్టై సర్దుకుంటూ కుడిచేత్తో హాట్ ఊపుకుంటూ విసురుగా బైటకువచ్చాడు. ఆచారి బిత్తరపోయి చూచాడు.

ఆయన ఆచారి వంక—డాక్టర్ రోగిని పరిశీలించే పద్ధతిలో చూస్తూ వెళ్ళిపోయాడు.

టర్కీటవల్‌తో ముఖమూ, కాళ్ళూ తుడుచుకుంటూ ముందు గదిలోకివచ్చి సుశీల ఆచారికి నమస్కారం చేసింది.

"ఎవరమ్మా, ఇప్పుడు ఈ యింట్లోనుంచి వెళ్ళింది?"

"ఇప్పుడే నిద్రలేచి ముఖం కడుక్కొని వస్తున్నానండీ, నేను చూడలేదండీ,..." ఇచ్చిన హోమ్ వర్కు కాకుండా మరి రెండు పాఠాలలోని ప్రశ్నలకు కూడా జవాబులు వ్రాసిన నోటుపుస్తకాలు ఆచారి ముందు పెట్టి కూర్చున్నది సుశీల.

ఇతర భోగట్టా మానేసి నోట్సులు చూడటం మొదలెట్టాడాచారి. అందులో ఒక నోట్సు చూచేసరికి అతనికి చాలా ఆశ్చర్యం కల్గింది.

"అమ్మాయ్, నీవు సంస్కృతం కూడా నేర్చుకుంటున్నావా?"

"ఔనండీ, రఘువంశం మొదటి సర్గంతా ఐపోయింది."

"సంస్కృతం మేష్టారు ఉదయంపూటవస్తారా"

"లేదండీ, ఇంట్లో మా అమ్మే చెపుతుంది. మా అమ్మ ఎప్పుడూ సంస్కృతం శ్లోకాలు బలే చదువుతుందండీ, నాకసలు నోరు తిరగవు"

ఇంటర్ మీడియేట్ దండయాత్రల్తో ప్రాణం విసిగి సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ తో సర్దుకున్న ఆచారికి థర్డ్ ఫారంవరకూ ఇంగ్లీషు, లెక్కలు, సోషల్ స్టడీస్ మొదలైన ఏ సబ్జెక్టైనా కొట్టినపిండే కాని తెలుగంటే మాత్రం మింగరాని ముద్ద. ఇటీవల శరత్, చలం నవలల వల్ల తెలుగంటే అభిమాన మేర్పడ్డా, "వర్ధనమ్మ గారమ్మాయికి తెలుగు పాఠం చెప్పాలంటే ఒళ్ళు దగ్గరపెట్టుకోవాలేమో" ననుకున్నాడు.

పాఠం చెప్పటం పూర్తైంది. ఒక్క క్షణంలో లోపలికి పోయి సుశీల ఫలహారపు పళ్ళెం తెచ్చి ఆచారి ముందు పెట్టింది. సుశీల వట్టిపట్టువల పిల్ల. ఆచారి వద్దన్నా అతనికి ఫలహారం చేయక తప్పింది కాదు.

మసక చీకట్లో ఇంటికిపోతున్న ఆచారికి బ్యాడ్ మింటన్ కోర్టు నుంచి బ్యాట్ ఊపుకుంటూ వస్తున్న అచ్యుతరామయ్య ఎదురుపడి "గుడ్ నైట్ మిస్టర్ ఆచారీ, విష్ యు ఎ హ్యాపీ నైట్" అంటూ వెళ్ళి పోయాడు.

ఆచారికి చంద్ర కోలతో చఱచి కొట్టినట్లైంది. పండ్లు కొరుక్కుంటూ ఇంటికి వెళ్ళాడు. "ఎదుటివాడుపచ్చగాఉంటే చూడలేని దరిద్రుడు. చొక్కా కాలర్ పట్టుకొని ఆ చెంపా ఈ చెంపా వాయిస్తే సరిపోయేది......అయినా, ఈ ఊరికి మనం క్రొత్త ... తొందరపడకూడదు .... కాకపోయినా ఇంత చదువుకొని, గౌరవంగా బ్రతుకుతూ రాఢీవెధ వల్లా కొట్టుకోవడ మేమిటి?" ఆచారికి అసహ్యం కల్గింది.

రాత్రి ఎనిమిదిన్నరగంటలైంది. ఇంట్లో ఎవ్వరూ లేరు. హోటలుకుపోయి భోజనం చేయాలనిపించలేదు. వర్ధనమ్మగారి టిఫిన్ బలంగాబడ్డది. "ఆమె స్వభావం ఎంత ఉదారమైంది?"

"...మరి ... వర్ధనమ్మగారింట్లోనుంచి వెళ్తూన్న తేరిపార! చూచిన సూట్ వాలా ఎవడు?... జీతగాణ్ణడిగితే......ఆఁ... మనకెందుకు? పాఠం చెప్పి ఇవతల కొస్తే పోయేదానికి? ఆచారి ఆలోచిస్తూ నిద్రపోయాడు.

మర్నాడు శనివారం; బడిలేదు. "ట్యూషన్ పని ఉదయమే ముగించుకొని మధ్యాహ్నం నుంచీ టవున్ కు పోయి సినీమా చూచి వచ్చినా బాగుండును?" ఆచారి నేరుగా వర్ధనమ్మగారింటికి వెళ్ళాడు. జీతగాడు కనిపించాడు.

"ఏం బాబూ, ఇవ్వాళ ఉదయమే వచ్చారు? అమ్మాయి, అమ్మగారూ బస్తీకెళ్ళారే, ఏవో పనులుండి!...అయ్యో, వాకిట్లోనే నిలబడి పోయారు? లోపలికిరండి. సాయంత్రం మీరు పాఠం చెప్పే వేళకు వచ్చేస్తామన్నారు."

ఆచారికి జీతగాణ్ణి కదిలించి కాసేపు సంభాషణ పెంచుదామనిపించింది. "అన్నట్లు నీపేరైనా అడిగాను గాదు!" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

"అందరూ పిల్చే పేరుకేం గాని బాబు, మా వర్ధనమ్మతల్లి "సుబ్బులు బాబాయ్" అని కన్నబిడ్డ పిల్చినట్లు పిలుస్తుంది. మా చిట్టితల్లి సుశీలమ్మ "సుబ్బులు తాతా" అని తప్ప పిలవదు"

బైట గాలి విసురుగా ఉండటంచేత లోపలి వాకిలి తెరగుడ్డ ప్రక్కకు ఎగిరింది. గోడ ప్రక్కగా లోపల ఒక వీణ కనిపించిందాచారికి.

"ఇదుగో ఆ వీణ ఎవరు వాయింమతారు సుబ్బయ్యా!"

"సుబ్బయ్యా, ఎందుకులే బాబూ, అందరూ పిల్చేటు 'సుబన్నా' అంటే చాలు" జీతగాడు సిగ్గుపడుతూ అన్నాడు. "ఈ వీణంటారా......చదువుల సరస్వతి—భగవంతుడు చిన్నచూపు చూచాడుకాని ఎంత తెలివిగలది మా వర్ధనమ్మ తల్లి? మనస్సు చీకాకుతో అన్నీ మర్చిపోయింది. మళ్ళీ మా చిట్టితల్లి సుశీల కోసమని బూజు దులిపి ఈ వీణమీద పాఠం చెబుతూంది."

సుబ్బన్న చెప్పుకుపోతూండగా మధ్యలో ఒక కుఱ్ఱవాడు వచ్చి "ఆచార్లు మేష్టారున్నారా, వారమ్మగారూర్నుంచి వచ్చారు. వార్ని రమ్మంటున్నారు" అని చెప్పాడు.

ఆచారి వెంటనేలేచి ఆ కుఱ్ఱవాడికి తాళం చెవి ఇచ్చి మళ్ళీవచ్చి కూర్చున్నాడు. సుబ్బన్న కూర్చున్న వాడల్లా లేచాడు. "పోయిరండిబాబూ,... నాకూ ఇంట్లో వల్లమాలిన పని."

ఆచారికి సంభాషణ పొడిగించటం కుదరక కుఱ్ఱవాడివంక కొరకొర చూస్తూ లేచాడు.

లోపలకు వెళ్తూన్న సుబ్బన్న మళ్ళా గిరుక్కున వెనక్కు తిరిగి వచ్చి "బాబూ, అడగ మరిచాను తమకు పిల్లలెందరు?" అన్నాడు.

ఆచారి లోపల్లోపల నవ్వుకొంటూ అన్నాడు. "ఏదీ, ఇంకా లేఁ... ఇప్పుడిప్పుడే..."

"మీలాగే బంగారంలాగుండే బాబు పుడతాడు లెండి... వస్తా" సుబ్బన్న తలుపు గడియ వేసి లోపలికి వెళ్ళాడు.

"సుబ్బన్న బహు గడుసువాడు" అనుకుంటూ ఆచారి వాకిట్లోనే ఉన్న కుఱ్ఱవాణ్ణి చూచి "నేనిక్కడ ఉన్నానని ఎవరు చెప్పార్రా?" అని కసురుకుంటూ అన్నాడు.

"మీరిక్కడ ఉండవచ్చుని మీ అమ్మగారితో అచ్యుతరామయ్య మేష్టారు చెప్పారండీ!"

"వీడొకడు, శనిగ్రహంలా దాపురించాడు. వీడి వ్యవహారమేమిటో తేల్చుకోవాలిసిందే" ఆచారి రుసరుసలాడుతూ వెళ్ళాడింటికి.

తాళం వేసిఉన్న వాకిలి కివతలగా ఆచారి తల్లి వియ్యపురాలు పెట్టిన కొత్త మల్లు దోవతి తలమీదికి లాక్కుంటూ కూర్చున్నది. ముందు మెల్లాలో కూర్చొని అచ్యుతరామయ్య క్లాసులో పాఠం చెప్పే తీరుగానే చేతులు త్రిప్పుతూ ఆమెకు అదీ ఇదీ నూరిపోస్తున్నాడు. ఆచారికి వళ్లు మండిపోయింది. తలుపు తీసి సేరుగా లోపలికిపోయి మంచంవాల్చి పడుకున్నాడు. "వస్తానయ్యా, ఆచారి!" సంభాషణ ముగించి అచ్యుతరామయ్య బైట మెల్లాలోనుంచే చల్లాగా కదిలి వెళ్ళాడు.

"అచ్యుతరామయ్యగారు మంచివారు నాయనా, ఎంతమంది నడిగినా నీ వెక్కడున్నదీ తెలియలేదు. శ్రమపడి ఒక్క నిమిషంలో నిన్ను పిలిపించారు......" ఆచారి తల్లి ఏమేమో చెప్ప పోయింది.

"ఊఁ... సరేలే! అక్కడి విషయాలేవిఁటి?" ఆచారి విసుగ్గా అడిగాడు.

"అందరూ చీరా, రైకా బాగుందన్నారు నాయనా, నూడిదలు సలక్షణంగా జరిగాయి... తీరికగా చెపుతాలే, ప్రొద్దు తిరిగిపోతూంది" వంటగదిలోకి పోతూ చెప్పింది.

సాయంత్రం కాగానే మామూలు వేళకు ఆచారి వర్ధనమ్మ గారింటికి వెళ్లాడు. ఆమెగారింకా రాలేదు. తలుపుకూడా తాళం వేసి ఉన్నది. "బహుశా సుబ్బన్న వారిని తీసుకురావటానికి స్టేషనుకు వెళ్ళాడేమో?"

ఆచారి ఒక గంటసేపు చూచాడు. "ఇక రారేమోలే" అనుకొని వెనక్కు తిరిగాడు. గుఱ్ఱపు బండి కనిపించింది. ముందు బండివాడి ప్రక్కగా సుబ్బన్న కూర్చొని ఉన్నాడు. ఆచార్ని చూచి "రండి బాబు రండి" అంటూ సుబ్బన్న బండిలోనుంచీ దిగి తలుపుతాళం తీశాడు.

బండికి ముందు వెనుకల కట్టిన చీరను తొలగించుకుంటూ లోపలనుంచి క్రిందికి దిగి సుశీలనుకూడా రెండు చేతుల్లోకి తీసుకొని దింపింది. సుశీల భుజంమీద చేయివేసి వర్ధనమ్మ నడిచిపోతూఉంటే వెనుకనుంచి చూచాడు ఆచారి.

"కనకాంబరం పట్టుచీర కట్టుకొని, కొండె చుట్ట చుట్టుకొని, నిండా ముప్పైఏళ్ళైనా ఉండని నిండు జవ్వనంలోఉన్న వర్ధనమ్మ; ఎంత గంభీరమైన విగ్రహం? నడకలో ఎంతటి హుందాతనం!" ఆచారి వెనుకనుంచి నిదానంగా నడుస్తూ సావధానంగా చూచాడు.

"బండిలో కాయలసంచి ఉండాలే!" అంటూ గేటులో అడుగుపెడుతూ వర్ధనమ్మ గిరుక్కున వెనక్కు తిరిగింది.

బండివంకకు చూస్తున్న వర్ధనమ్మ ముఖంలోకి చూచాడు ఆచారి. "ముఖమంతా వాడిపోయిఉన్నది. కళ్లు ఎఱ్ఱగాఉన్నై. అవమానంతో హృదయం గంటు వడినట్లుగా ఉన్నది." వర్ధనమ్మ ముఖంలోని విషాద రేఖలకు కారణం ఊహించుకోలేకపోయినాడాచారి.

"పాపం, మగదిక్కు లేదు" ఆచారి మనస్సు దయతో తడిసిపోయింది.

ఆరోజు సుశీలకు పాఠంచెప్పి లేచేసరికి రాత్రి తొమ్మిదిన్నరయింది. ఇంటికి పోయేసరికి దాదాపు పదికావచ్చింది.

"అబ్బాయీ, నీవుఅక్కడా ఇక్కడా తిరిగియింత ప్రొద్దుపోయి ఇంటికి వస్తూంటే నా మనస్సు అనేక విధాలుగా పోతూంది." అంటూ ఆచారి తల్లి సాగ తీయపోయింది.

ఉదయం అచ్యుతరామయ్య వేసిన పొడిప్రభావమేమోనని ఆచారికి తోచింది. భోజనం చేయకుండానే చటుక్కున బైటకు వచ్చాడు. "భోజనం చేయకుండానే వెళ్తావేంనాయనా ?" తల్లి పిలుస్తూనే ఉంది ఆకాశం మబ్బులుపట్టి చీకటి దట్టంగా ఉన్నది.

నేరుగా అచ్యుతరామయ్య ఇంటికివచ్చి గట్టిగా తలుపుకొట్టాడు. అచ్యుతరామయ్య తలుపుతెఱచి చూచి దిగ్భ్రాంతి చెందాడు. ఆచారి బొమలు ముడివడిఉన్నై. కళ్లు చింతనిప్పులా మెరిసిపోతున్నై.

"ఒక్కసారి ఏకాంతంగా మాట్లాడాలని వచ్చాను."

"ఓ! యథేచ్ఛగా," అచ్యుతరామయ్య లాంతరువత్తి పైకిత్రిప్పి కూర్చోమన్నట్లు ఆచారికి మంచం చూపించాడు. ఆచారి కూర్చోకుండానే అటూ ఇటూ చూచాడు.

"అంతా లోపల పడుకొనిఉన్నారే! ఎంతటి చిదంబర రహస్యమైనా చెప్పవచ్చు, చెప్పు" అచ్యుతరామయ్య విసురుగా ఒక ముక్తాయింపు ఇచ్చాడు.

"వర్ధనమ్మగారింట్లో ట్యూషన్‌గురించి ఏమిటి నీవుచేసే ప్రచారం ?" ఆచారి అచ్యుతరామయ్య కళ్లల్లోకి భయంకరంగా చూస్తూ అన్నాడు.

"బుజాలు తడుముకోవడంగా ఉంది." అచ్యుతరామయ్య చిఱునవ్వునవ్వాడు.

"విషపు నవ్వులూ, డొంకతిరుగుడు మాటలూ వద్దు, సూటిగా చెప్పు."

అచ్యుతరామయ్య చట్టున మంచంమీదినుంచీ లేచి లాంతరు మరికొంచెం పెద్దదిచేసి గట్టిగా అన్నాడు. "ఏమి అభిమానం! విను; జాగ్రత్తగా విను; టూకీగా చెప్పేస్తాను"

ఆ పిల్ల—అంటే—సుశీల తన పిల్ల గాదని ఆమె తండ్రి వర్ధనమ్మను విడిచిపెట్టి అయిదేళ్లయింది. ఇప్పుడింకా కోర్టులో వ్యవహారం నడుస్తూంది. ఇప్పుడున్న మేడలోనే వర్ధనమ్మ భర్తకూడా ఉండేవాడు. ఆమె ప్రవర్తన ఏమాత్రం నచ్చకనే ఆయన ఊరు వదిలివెళ్ళి మరో పెళ్ళికూడా చేసుకున్నాడు. ఆయనికిప్పుడు ఇద్దరు మగపిల్లలు.........వర్ధనమ్మ తరహా తెలియక నీలాగే నేనూ సుశీలకు ట్యూషన్‌కు కుదిరాను. డబ్బు వర్షంగా కురిపించింది. కాని నాపట్ల వర్ధనమ్మ ప్రవర్తన నన్ను నా సంసారాన్నించి దూరం చేస్తున్నట్లనిపించింది...అడ్డం తిరిగితే ఆమె ఎంత సాహసానికైనా తగు. ఆ యింట్లో ఉండే పోతరించిన మృగం- సుబ్బడు. పీకలు కోసేరకం..."

"ఇంతా తెలిసి కాస్త వ్యంగ్యంగానైనా రెండుపోట్లు పొడిస్తే తేరుకుంటావుగదా అనుకున్నాను. వర్ధనమ్మ కైపు నీకిప్పటికే బాగా తలకెక్కింది. జాగర్తోయ్ కుఱ్ఱాడా! ఈ ఊరు నీకు కొత్త; ఏ అందచందాలు లేని నావంటి మొరటు మనిషిమీదకే ఉప్పెనలా వచ్చిపడ్డది వర్ధనమ్మ. మిసమిసలాడే కుఱ్ఱాడివి; మింగే నూరుకుంటుంది...మరోసారి చెబుతున్నా పడుచు పెళ్ళాం మొగుడివి; ఆ యమ్మ ఇక్కడ లేను కూడా లేదు కామాలె...పొద్దుపోయింది ఇంటికిపోయి మాత్రమే పడుకో."

జలపాతపు వేగంతో, గ్రుక్క తిప్పకుండా అచ్యుతరామయ్య నాటకంలో పోర్షన్ చదివేసినట్లు చదివి మంచంమీద ఛట్టునకూర్చొని దీపంవత్తి తగ్గించేశాడు.

ఒక్కసారిగా అచ్యుతరామయ్యగదిలో భూమి బీటలువారి తాను పాతాళంలోకి సర్రున జారిపోతున్నట్లనిపించిందాచారికి. "ఇదంతా అభూతకల్పనవౌతుందా!...ఇతగాడు చెప్పిన వాటికన్నిటికీ నిదర్శనాలుకూడా కన్పిస్తున్నాయే! బురదలో దిగబడ్డానా ?"

ఆచారి ముఖంమీద నెత్తురుచుక్క లేదు. గాంఢాంధకారం చీల్చుకుంటూ చరచరా ఇంటికి వచ్చాడు.

గాలికి గదిలో చిమ్నీదీపం కాస్తా ఆరిపోయింది. కన్ను పొడుచుకున్నా కనపడని చీకట్లో రేడియం డైల్ అలారం టైమ్‌పీస్ అంకెలూ, ముల్లూ మాత్రం గుడ్లగూబ కన్నుల్లాగ భీతావహంగా కన్పించాయి. ఆచారికి దీపం వెల్గించాలన్న స్పృహ కలుగలేదు. గుర్తుగా కాళ్లతో తడువుకొని మెల్లగా మంచంమీద శరీరం వాల్చాడు.

కన్ను మూతపడలేదు. ఆలోచనా తరంగాలు సుళ్లుతిరిగి అల్లకల్లోలం చేశాయి. ఆలోచించి ఆలోచించి ఒక స్థిరనిర్ణయానికి వచ్చాడు.

"ఈ ట్యూషన్‌కూ దీనికీ ఒక నమస్కారం రేపటితో తెగతెంపులు చేసుకోవలసిందే! ముట్టిన పద్యవోటంటావ్? ఆఁ... చెప్పిన పదివాళ్లయినా చెమటోడ్చి దీక్షతో చెప్పలేదూ? దానికీ దీనికీ సరి!"

తెల్లవారింది. గబగబా కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ పుచ్చుకొని బయలుదేరాడు ఆచారి. లోపలనుంచివచ్చి వక్కపొడి డబ్బా చేతికందిస్తూ అన్నది ఆచారి తల్లి "ఒక్కసారి అత్తగారింటికిపోయి అమ్మాయిని చూచిరాకూడదటరా, శని ఆదివారాల్లోకూడా కుటుంబం పనులు చూచుకోకపోతే ఎట్లా! ఎప్పుడూ ఉండే ప్రైవేటేగా."

ఆచారి తల్లిమాటలు వినిపించుకోకుండానే వెళ్ళిపోయాడు. గదిలో అలారమ్ టైమ్‌పీస్ గణగణా మోగింది.

నేరుగా వర్ధనమ్మగారింటి ముందుగదిలోకి పోయి నిలబడ్డాడు. మేడపైఅంతస్థునుండీ తెరలు తెరలుగా వీణానాదం వినిపిస్తూంది. వర్ధనమ్మగారి శ్రావ్యమైన కంఠస్వరంలో సుశీలమ్మ పిల్లకోయిలకోన రింతలు లీనమై తీవలు తీవలుగా కదిలివచ్చినట్లయింది. వర్ధనమ్మ వీణావాదన నైపుణ్యంగాని, గానకళా విన్యాసంగాని అనుభవించే ఓర్పు లేకపోయిందాచారికి. "సుబ్బన్నా" అని పెద్ద కేక పెట్టాడు.

చిటిపొటిజల్లులు చిలకరించుకొంటూ దొర్లి దొర్లి వచ్చే కొండవాగులా రెండు చేతుల్తో పరికిణీ కుచ్చెళ్లు ప్రక్కలకు లాగి పట్టుకొని దుముక్కుంటూ మేడమెట్లు దిగి, వచ్చింది సుశీల. "సుబ్బులు తాతతో పనుందండీ మేష్టారూ? బజారు వెళ్లాడు కూర్చోండి" వినయ విధేయతలు పెనగొన్న అమాయికపు పసినవ్వులు క్రుమ్మరిస్తూ పల్కింది. సహజంగానే ఏదో ఒక మెత్తందనము, మార్దవము తొణికిసలాడే సుశీల పలుకులు చెవిసోకగానే సుతిమెత్తని మనస్సుగల ఆచారి హృదయంలో వాత్సల్య రసం పొంగి పొరలెత్తింది. అతని ముఖంలోని కెంపు రంగులన్నీ ఒక క్షణంలో మాయమైపోయాయి. అప్రయత్నంగానే అతని పెదవి చలించింది "ఏమీ లేదు తల్లీ, ఇవ్వాళ ఆదివారం కదూ, పాఠం చెప్పేసి పోదామని వచ్చాను. అమ్మగారు పాఠం చెపుతున్నట్లున్నారు; పోనీ సాయంత్రం వస్తాలే!"

"ఇంట్లో పిచ్చి పాఠాలకేమిలే, మేష్టరుగారిచేత పాఠం చెప్పించుకో సుశీ!" వర్ధనమ్మ గొంతు పైనుంచీ స్వరితక్రమంలో వినిపించింది.

"నేను చెప్పే చివరిపాఠం ఇదేకదా" అని మనసులో అనుకొని ఎంతో లాలనగా ఆప్యాయంగా ముద్దుముద్దుగా చాలాసేపు చెప్పి, ట్యూషన్‌కు స్వస్తి చెప్పే సంగతి సుశీలముందు ప్రస్తావించడం మనస్కరించక, "అట్లా వెళ్ళి కాస్సేపు విశ్రాంతి తీసుకో తల్లీ" అని ఆ అమ్మాయి పోనంటున్నా బలవంతంగా అవతలకు పంపించాడు. సుశీల వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ పోతూంటే ఎందుకో ఆచారి కళ్లు చెమ్మగిల్లాయి.

"సుశీ, ఈ కాఫీ మేష్టరుగారికిచ్చిపోమ్మా; సుబ్బులు తాతకూడా ఇంట్లో లేడు" లోపలినుంచీ వర్ధనమ్మ మెలగా పిలిచింది.

"అమ్మాయి అట్లా అవతలకు వెళ్ళింది లెండి ఇప్పుడు కాఫీ ఎందుకు? ఒకసారైంది లెండి! వర్ధనమ్మ తనే తెర తొలిగించుకొని కాఫీ కప్పూ, సాసర్ ఆచారి ముందుంచి అవతలకు పోయింది. ఆచారి, మెల్లగా నడిచిపోతున్న ఆమె వైపుకు నిర్వికారంగా చూస్తూ అన్నాడు. "వర్ధనమ్మగారూ, ఇప్పటికే మీకు చాలా ఋణపడ్డాను. ఏదో ఈ పదిరోజులూ అమ్మాయికి శక్తివంచన లేకుండా నే చెప్పాననుకుంటాను..." ఆచారి మాటల్లోని వీడ్కోలు సందేశం తాలూకూ ధ్వని గుర్తించి వర్ధనమ్మ మనస్సులో ఎంతో నొచ్చుకున్నది.

"అయ్యో, మీకు ముట్టిన తృణమెంత? అమ్మాయి కబ్బిన విద్యాబుద్ధులు గుఱించి బ్రతికినంతకాలం చెప్పుకుంటాము ఏమోగాని—మీరు చెప్పటం ప్రారంభించిన దగ్గర్నుంచీ అమ్మాయిలో ఎంతో మంచి వికాసం కనిపిస్తూంది. ఈ పదిరోజుల్లో మీకే మేమెంతో ఋణపడ్డాము" మధ్య మధ్య తెర తొలిగిస్తూ ఎంతో కృతజ్ఞత తొణికిసలాడేట్లు పలికింది.

"ఎప్పుడో రోజులో ఒక గంట నేను చెప్పటం వల్ల ఏ మబ్బుతుందండీ; సంగీత సాహిత్యాల్లో ప్రావీణ్యంగల పెద్దలు ఇంట్లో ఉండి బిడ్డల్ని తీర్చి దిద్దుకుంటూ ఉంటే అదే చాలు" వర్ధనమ్మ పాదాల మీద దృష్టి సారిస్తూ పల్కాడు ఆచారి.

"పూజ్యులు మా నాన్నగారు జీవించి ఉన్న రోజుల్లో నేర్చుకున్న చిన్ననాటి చదువు, ఆ చదు

వేంత?...నిజంగా ఉదారులైన మీ వంటి గురువుల సన్నిధిలో ఉండి చదివే చదువు వేఱు" వర్ధనమ్మ తెర కివతలగా వచ్చి పైట చెరగుతో కన్నీళ్ళద్దు కుంటూ పల్కింది.

కోమలములైన వర్ధనమ్మ పాదాల మీదుగా పై కెగ్రబాకి ఆర్ద్రములైన ఆచారి చూపులు, కన్నీళ్లుపడి వింత వింత రంగులు వెదజిమ్మే ఆమె రాళ్ళ నెక్లెస్ ప్రాంతాల్లో వాలాయి.

"కాఫీ చల్లారిందేమో, చాలాసేపైంది. భోజనం వేళకూడా కావచ్చింది. మరి మీకు అభ్యంతరం లేకపోతే...ఇక్కడ వంటకూడా అయింది భోజనానంతరం కొంచెం విశ్రాంతి తీసుకొని పోవచ్చు" వర్ధనమ్మ పెదవులమీద దరహాసపు వెన్నెలలు పలుచ పలుచగా విరిశాయి.

ఆమె కంఠంలోని శ్రావ్యత అనుభవించడానికి గాని, ఆమె మాటల్లోని మాధుర్యం చవిచూడటానికి గాని, ఆమె రూపంలోని సౌందర్యం దర్శించడానికి గాని, అతనికి తన ఇంద్రియాలు అశక్తములనిపించాయి ఒక్కక్షణ కాలం ఆమెవంక వెఱ్ఱిచూపు చూచి, గట్టిగా కన్నులు మూసుకొని గటగటా త్రాగాడు చల్లారిన కాఫీ మొత్తం.

"ఇంటికి వెళ్ళాల్లెండి" అంటూ లేచి చకచకా బైటకు వచ్చాడు.

"రాత్రికూడా భోజనం చేయలేదుగదా" అని ఆచారి తల్లి హడావుడిగా వడ్డనచేసి పిలిచింది కొడుకుని. గబగబా నాలుగు మెతుకులు గతికి పోయి నుక్క మంచంలో వాలాడు.

"ఇవ్వాళ ఆదివారం కాదునాయనా, సాయంత్రమైనా ఇంట్లోకి వెచ్చాలు తెచ్చి పడేయ్" వెల్లకిలా పండుకొని పై పూరికప్పు పరీక్షిస్తున్న ఆచారితో చెప్పింది తల్లి.

"ఏమిటో, వెచ్చాలదాకా వెళ్లింది! మధ్యాహ్నం కాఫీకి గతుందీ? వర్ధనమ్మగారి పుణ్యమా అని ఉదయం మ్రొక్కు తీరింది."

వర్ధనమ్మ స్ఫురణకు వచ్చేసరికి ఆచారికి సర్వేంద్రియాలకూ సంతర్పణ జరిగినట్లు తోచింది. ఎంత లోతైన గుండె! మాటలో ఎంత మార్దవం!... "మీ వంటి గురువుల సన్నిధిలో ఉండి చదివే చదువు వేరు" ఎంత ఆకర్షణ!

ఆచారి తన శరీరంవంక చూచుకున్నాడు. చొక్కా చిరుగుల్లోనుంచి ఎఱ్ఱని తన దేహం కనిపించింది. అతనికి అభిమానం ముంచుకొచ్చింది చరచరా లేచిపెట్టె తెఱచి పెళ్లినాటి పట్టుత్తరీయం తీసి చొక్కా మీన కప్పుకున్నాడు. "అట్లా బజారుకైనా వెళ్దాం కొత్తహోటల్లో పద్దుపెట్టి కాఫీ పుచ్చుకోవచ్చు... ధోవతి, గూడకట్టువిప్పి గోచిపెట్టి కట్టుకుంటే ఒంటి పొరమీది చిరుగులన్నీ బైటపడతాయి; వద్దులెస్తూ".

తెలివిగా కాఫీ పుచ్చుకొని ప్రొద్దుపోయిందాకా కాలం వెళ్ళబుచ్చి రాత్రికి ఇంటికి వచ్చాడు. నెయ్యికూడా లేకుండా పొడి పొడి పచ్చడి మెతుకులు గొంతు దిగలేదాచారికి. పోయి నుక్క మంచం మీద వాలాడు.

"చదవడానికి ఏదైనా పుస్తకమున్నా బాగుండును? వెధవ సోషల్ స్టడీస్! బండలెక్కలు! సమ సంబంధ సామ్యం, విలోమ సంబంధసామ్యం!" విసిరి అవతల పారేశాడు క్లాసు పుస్తకాలు.

ఒక రెక్క బంగులాడిన చెక్కబీరువా తెరిచి చూచాడు. పంచాయతీబోర్డు లైబ్రరీలో ఎప్పుడో తెచ్చిన పుస్తకాలు రెండు కన్పించాయి. ఆచారి కన్నులు మెరిశాయి.

"బ్రాహ్మణీకం"... "కర్మమిట్లా కాలింది"

చిమ్నీవత్తి పైకెత్తి పుస్తకంలో దిగబడ్డాడు.

"సంప్రదాయాలనీ, ఆచారాలనీ ఆదిలో మొండికేసిందిగానీ పిచ్చిపిల్ల శరీరధర్మం అణచుకోగలిగిందీ? ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాలతో ఒంపులు ఒంపులుగా లేచిపడే ఆమెవక్షం, దృఢమైన, విశాలమైన అతని ఉరస్సు క్రిందబడి అణిగి మణిగి వెచ్చదనాన్ని పొందుగుకోలా?" ఆచారి దేహం వేడెక్కిపోయింది, బ్రాహ్మణీకం పుస్తకం తీసి అవతల పెట్టాడు.

"పిచ్చిరెడ్డి రంగమ్మ! కృష్ణునిమీది మూఢ భక్తితో గోపికలా గంగ వెఱ్ఱిలెత్తిపోయింది, వేషం ధరించిన జనార్దనరావు దగ్గరకు; ఆ మహానటుడు నవటాకు నిషా దిగకముందే భక్తితో పరవసించిన రంగమ్మను వెచ్చని కౌగిటిలోకి జీర్ణించుకున్నాడు."

"కర్మమిట్లా కాలింది"...పుస్తకం అవతల పడ వేశాడు.

ఒళ్ళంతా కంపరం ఎత్తింది ఆచారికి. మెడల క్రిందికివాలిన మాసికలచొక్కా కాలర్ పైకెత్తి నిల బెట్టాడు.

"మీ కభ్యంతరం లేకపోతే...ఇక్కడే విశ్రాంతి తీసుకోవచ్చు" ఒయ్యారాలు ఒకలబోస్తూ వర్ధనమ్మ సుందరస్వరూపం ప్రత్యక్షమై అతని మానసిక క్షోభను ఇనుమడింపజేసింది. పెళ్ళినాటి పట్టుధోవతికూడా తీసి పింజలుబోసి అందంగా కట్టుకొన్నాడు. ఉన్న చొక్కాకు గుండీలు పెట్టుకొని పట్టుత్తరీయపు చెర గులు సవరించుకొన్నాడు. పక్కపాడిపెట్టా అడుగు దులిపి ఇంత చప్పరిస్తూ వాకిలితలుపు బైట గొళ్లెం పెట్టి బైలుదేరాడు.

ఆచారి తల్లి దొడ్లో ఒళ్ళుతెలియకుండా నిద్ర పోతోంది.

పంచాయతీవారి బజారు లాంతరు దీపాలలో నూనె పదకొండున్నరకే అయిపోతుంది. మనిషి మనిషి కనిపించని గాఢాంధకారం. ఆచారి నడుస్తున్నాన్న జ్ఞానముకూడా లేకుండా పోతున్నాడు. ఒకటి రెండు కుక్కలు అతనికి దగ్గరగావచ్చి మోరలెత్తి గ్రై గ్రై మని అరుస్తూ మెల్లగా రాగం సాగదీస్తూ అవతలకి పోయాయి. బజారు ప్రక్కన గుబురుగా పెరిగిన గన్నేరుకొమ్మల చాటుగా గలగల గాజులచప్పుడై, అమిత వేగంతో ఊర్పులు వినిపించాయి. మెత్తని కండర మేదో తన బుజం రాసుకుపోయినట్లయింది ఆచారికి. అతనితల దిమ్మెక్కిపోయింది.

చరచర నడిచి వర్ధనమ్మ రెండంతస్తుల మేడబైట గేటుదగ్గర నిల్చాడు. గేటు ఓరగావేసి ఉన్నది. మెల్లగా తెరుచుకొని లోపలికి వెళ్లాడు. మేడమీదికి పోయే మెట్ల తలుపులుకూడా ఓరగానే వేసిఉన్నై. మసకలాడబోయే జెట్టిపోతులా బుసలుకొడుతూ మోర వంచి గబగబా మెట్లెక్కాడు.

లాంతరువత్తి పెద్దదిగా వెలుగుతూంది. దాని ముందు కుర్చీమీద సగంతెరచిన గ్రంథాలు పరచి ఉన్నాయి. గ్రంథాల్లోని లిపి సంస్కృతమో, హిందీమో గమనించగలస్థితిలో లేడాచారి. పరి సరంలో పురుషులెవ్వరూ లేరన్న దృష్టితో యథే చ్ఛగా పడుకుని ఉన్న వర్ధనమ్మశరీరం ఆపాదమస్తకం చూచాడు.

దీపం క్రీనీడలో తలుపు రెక్కచాటుగా నిల బడ్డాడు. అతనిలో నిద్రాణంగా పడిఉన్న పశుత్వం మోరవంచి కొమ్ములుపైకెత్తి ఖణిల్లున అంకెపెట్టింది. దీపపుకాంతుల్లో మహోజ్వలంగా పెరిగిపోతున్న వర్ధ నమ్మ దేహంలోని ఒయ్యారపువంపులు దప్ప-ఆమె చాటుగా గువ్వపిల్లలా ఒదుక్కుపడుకున్న సుశీల కాని, మరే యితర పదార్థంగాని అతనిదృష్టికి కనిపించ లేదు.

తలుపుచాటునుండి గభాలున అడుగు ముందుకు పెట్టాడు. పొడవైన అతని నీడ మెట్లమీదగా క్రిందికి ప్రాకింది. అనుకోకుండా హఠాత్తుగా తన చుట్టూ దృఢమైన బాహువులు రెండు పెనవేసుకుని, తన్ను పైకెత్తినట్లనిపించింది. స్ఫృహతెచ్చుకొని తలవెనక్కి త్రిప్పుకొని చూచేసరికి క్రిందిగదిలో తన ప్రక్కన సుబ్బన్న నిలబడి తన ముఖంమీద లాంతరుపెట్టి తేర పార చూస్తున్నాడు.

"ఆఁ...మీరనుకోలేదు బాబూ నేను. ఇంత అర్ధరాత్రివేళ వచ్చారేం?"

"నిజంగా సుబ్బన్న పీకలుకోసేరకమా?"... అయినా ఆచారికి అతనివాలకం చూస్తుంటే కొంచెం ధైర్యం వచ్చింది. ఒక ఆలోచనకూడా తట్టింది. లేని నవ్వు తెచ్చుకున్నాడు. గొంతు సర్దు కొని ఎక్కడో నూతిలోఉండి చెప్పినట్లు చెప్పాడు.

"కొంపదీసి దొంగ ననుకోలేదుగదా!. ... విషయం చెప్తా విను సుబ్బన్నా, మా అత్తగారింటి నుంచీ హఠాత్తుగా వచ్చింది టెలిగ్రాం. మా యావి డకు చాలా ప్రమాదంగా ఉంది. నే నిప్పుడే వెళ్ళాలి, నాకీవూరు కొత్త. ఈ చీకట్లో స్టేషన్ దాకా నిన్ను తోడుచేసుకొని వెళ్దామని వచ్చాను. నీవు క్రింద కనపడకపోతే అట్లా పైకి వచ్చాను; అంతే!"

"అట్లాగా....ఒక్కనిమిషం ఆగండి. వచ్చే స్తున్నా!" అంటూ గబగబా మేడమెట్లెక్కిపోయి పదినిమిషాల్లో క్రిందికి వచ్చాడు "గేటుతలుపు వేసుకు పోమ్మా" అంటూ లాంతరు పట్టుకొని సుబ్బన్న ఆచారిప్రక్కన నడుస్తూ బైటికి వచ్చాడు

"ఇంటికి పోవాలా బాబూ."

"అక్కరలేదు, ప్రయాణమయే వచ్చాను" ఆచారి ఉత్తరీయం సర్దుకుంటూ చెప్పాడు.

ముందు సుబ్బన్న, వెనుక ఆచారి. మాట్లా డ్డానికి ఆచారికి విషయమేమీ దొరకలేదు. సుబ్బన్నే అందుకున్నాడు. "నేను వెయ్యికళ్లతో చూస్తూ ఉంటాను. నిజంగా ఇవ్వాళ మీరుగాక మరెవరైన్నా ఐతేనా...పంబరేగగొట్టిఉందును."

కదులుతున్న నల్లరాతి విగ్రహంలా ఉన్న సుబ్బన్న సమున్నత దేహం లాంతరు వెలుతుర్లో చూచి ఆచారి తన జబ్బలు సవిరించుకున్నాడు. "లేచిన వేళ మంచిది."

ఊరి పొలిమేర దాటివచ్చారు. చిమ్మచీకటి జుట్టు విరియబోసుకొని ఉన్నది. ఇలకోళ్ల సంగీతంలో మధ్యమధ్య నక్కబావ కూనిరాగం సన్నగా సాగిసాగి

వినిపించింది ఆచారి సుబ్బన్నకు దగ్గరగా జరిగి నడిచాడు.

సుబ్బన్న మళ్లీ అందుకున్నాడు, "అసలు నా అనుమానం వేఱు....వచ్చినవాడు అచ్యుత రామయ్యగాడేమో అనుకున్నా. నా పామిరంగా...రక్తం తాగి ఉండును."

ఆచారి దిగ్భ్రాంతుడైనాడు. "అతనెందుకు వస్తాడు?"

"వాడా, దిక్కుమాలిన గాడిదకొడుకు! చిట్టితల్లికి పెళ్లి వేటుకని కుదిరిస్తే వర్ధనమ్మతల్లికే ఎసరు పెట్టాడు. మా తల్లి సీతామహాలక్ష్మి. ఆ అమ్మవంక అటువంటి పాపపుచూపు చూస్తే పుఱుగులుపడి చస్తారు. నిజంగా ఆ రోజు రాత్రి సమయానికి నేను లేకపోతే-అసలే చెడివున్న మా వర్ధనమ్మ బ్రదుకు బజారుపాలై పోయేది.

ఆ చేసుకున్న మొగుడు—కాపురం చేసినంత కాలం వేధించుకు తిన్నాడు. వాడికి అస్తమానం అనుమానమే! ఆ పీడ విరగడై ఇంతసుఖంగా చిట్టి తల్లిని చూచుకొని బ్రతుకుతూందిగదా అనుకుంటే, పోయినోడు పోక కోర్టుకీడ్చి నా తల్లి మానమర్యాదలు అల్లరిపాలు చేశాడు. నిజంగా పుట్టింటి తరఫున దేవుడులాంటి ఆ అన్నగారుకూడా లేకపోతే ఈ లోకంలో నా తల్లికి దిక్కెవరు?"

సుబ్బన్న కళ్ళవెంట బొటా బొటా నీళ్లు కారాయి.

"అన్నగారంటే ఎవరు సుబ్బన్నా!" కాలి క్రిందపడ్డ కప్పను దొక్కి ఉలిక్కిపడుతూ అడిగాడు ఆచారి.

"మీ గుండగానే వచ్చాడుగా ఒకసారి, అః, ఏమిటో, పిచ్చిబాబుని, మీ పనేమిటో మీరు తప్ప తలెత్తిచూడటం చేతగాదు...కోటూ, బూటూ వేసుకొని రాలా, ప్లీడరు. ఆయన లేకపోతే వర్ధనమ్మకీయా స్త్రీ అయినా మిగిలేదా?"

బొమలు ముడివేసి ఆచారి బలవంతంగా క్రింపెపెదవి కొరుక్కున్నాడు.

స్టేషన్ వచ్చేసింది. తెల్లవారుజామున నాలుగైంది. బండి ఒకగంట లేటట!

"ఇంటి దగ్గర వర్ధనమ్మ తల్లికి తోడెవ్వరూ లేరు, నే వస్తా బాబూ, పోగానే అమ్మాయిగారి సంగతి ఉత్తరం వ్రాయండి" సుబ్బన్న బయలుదేరబోయాడు.

సుబ్బన్నా, ఈ పెళ్లిగ్రాం సంగతి మా అమ్మకు తెలియదు. ఈ గొడవంతా ఆమెకు చెప్పకు. ఆమెకు మతిపోతుంది" అంటూ జేబులోనుంచి కలం కాగితం తీసి సుబ్బన్న చేతిలాంతరు వెల్తుర్లో సెలవుచీటీ గిలికి "బడికి చేర్చు"మని అతని కిచ్చాడు ఆచారి.

సెలవుచీటీ బొడ్లో పెటుకుందామని సుబ్బన్న ధోవతిముడత విప్పాడు. బొడ్లోనుంచి వంద రూపాయల కాగితం ఒకటి క్రిందపడి లాంతరు వెలుగుల్లో మెరిసిపోయింది. సుబ్బన్న దానిని గభాలున చేతితో తీసుకొన్నాడు.

"చూచారా బాబూ! ఎంత పొరపాటైందో?... ఈమధ్య నాకు మరీ మతిమరుపెక్కువైంది. ఇందాక వచ్చేటప్పుడు మా వర్ధనమ్మ తల్లిని లేపి "పంతులుగారి ఆవిడకు ఇట్లా ప్రమాదమట" అని చెప్పేసరికి, గబుక్కున లేచి ఇనప్పెట్టె తీసి "పాపం ఎంత ఇబ్బంది వచ్చిందో?" అంటూ ఈ నోటు మీ కిమ్మని ఇచ్చింది బాబూ" సుబ్బన్న ఆ నోటు ఆచారి జేబులో పెట్టాడు.

భయంతోనూ, అవమానంతోనూ క్రుంగిపోతున్న ఆచారి కళ్ళల్లో గిఱ్ఱున నీళ్లు తిరిగాయి. అతడు ఏమీ మాట్లాలేకపోయాడు.

"పిచ్చి బాబయ్యా! గుండె నిబ్బరించుకో కష్టాల్లోనే కష్టాలొస్తయ్, అమ్మగారు సుఖంగా ప్రసవిస్తుందిలే; వస్తా" సుబ్బన్న ఆచార్ని బుజ్జగిస్తూ చెప్పి లాంతరు తీసుకొని బయలుదేరాడు.

నీళ్లుక్రమ్మిన కంటి రెప్పలెత్తి అట్లా ఆచారి చూచేసరికే సుబ్బన్న పదిగజాల దూరం వెళ్లిపోయాడు.

నిర్భయంగా, నిశ్చలంగా గొల్లసుద్దులు పాడుకుంటూ ఊరివైపుగా పోతున్న సుబ్బన్న చేతిలోని లాంతరు కాంతులు చీకటి పాయల్ని విరియదట్టుతూ వింత వింత రంగుల నీలినీడల్ని ప్రసరింపజేస్తూ బ్రతుకుబాటల్ని వ్యక్తం చేశాయి.

కొడిగాలిన దీపంలాగు ఆచారి గుండె మెల్లగా తేరుకుంది. అతని కళ్లలో పుట్టింటి దగర పురుడు పోసుకోవటానికి పోయిన భార్య అమాయికమైన రూపం కలగా మెరిసింది.

గుప్పిళ్లు మూసుకొని కేరింతలు కొడుతున్న బంగారు పసిపాపను పొత్తిళ్లలో పెట్టుకుని "చూడండి, అంతా మీపోలికే" అంటూ పచ్చిబాలెంతరాలు తనకు దగ్గరగా వచ్చినట్లయింది. ఆచారి మనస్సూరికే ద్రవించిపోయింది.

ఇంతలోకే హఠాత్తుగా పిడుగుపడ్డట్టు పెద్ద అరుపు వినిపించింది. స్టేషన్లో రైలుబండి కదిలిపోతూంది. టిక్కెట్టు కూడా లేకుండా గబగబా పోయి ఆచారి రైలు తలుపుకమ్మి పట్టుకొని వ్రేలబడ్డాడు.